సాక్షి
నిజామాబాద్
మంగళవారం ■ 18 ■ ఏప్రిల్ ■ 2023



ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

- 8లో ▸



క్షయ రహిత జిల్లా లక్ష్యం

నిజామాబాద్‌ను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జాయింట్ డైరెక్టర్ రాజేశం సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.5 /26.2

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



ఇఫ్తార్ మంగళ: 6:38 | సహర్ బుధ: 4:33

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు క్రీడాకారులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో ముత్తెన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31వరకు గ్రామీణ ప్రాంతంలో 10 క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు, పీఈటీ, పీడీలు ఈ నెల 24లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గౌరవ వేతనం రూ. 4వేలు అందిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 97011 77144 నంబరును సంప్రదించాలన్నారు.

పుల్వామా ఘటనపై ప్రతిపక్షాల మాటే నిజమైంది

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి




ఖలీల్‌వాడి: పుల్వామా ఘటనపై ఆనాటి ప్రతిపక్షాల మాటే నిజమైందని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం జిలా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చెప్పేది ఒకటి ఆచరణలో పెట్టేది ఒకటన్నారు. పుల్వామా దాడి సమయంలో కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష పార్టీలు దేశ సైనికుల పక్షాన నిలబడ్డాయన్నారు. జమ్మూకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెప్పిన విషయాలు వింటే కేంద్ర ప్రభుత్వమే దేశద్రోహానికి పాల్పడినట్లు ఉందన్నారు. దేశ ప్రజలకు తెలియకుండా ఉండాలని ఆనాడు దేశ సైనిక అధికారులను, గవర్నర్ సత్యపాల్ మాలిక్ నోరును బీజేపీ ప్రభుత్వం మూయించిందని ఆరోపించారు. పుల్వామా దాడికి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి పుల్వామా దాడిని సుమోటోగా విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజ నరేందర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రీతం పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌పై శిక్షణ



ఖలీల్‌వాడి: ఎవరిదైనా సెల్‌ఫోన్ పోయినట్లయితే సిమ్‌కార్డ్ బ్లాక్ చేసి తర్వాత కొత్త సిమ్ తీసుకొని సంబంధిత పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ఆఫీస్‌లో సీఈఐఆర్ పోర్టల్‌పై ఏసీపీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయినట్లయితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఫిర్యాదు నంబర్‌ను తీసుకొని, ఈ ఫిర్యాదు నంబర్‌ను www.ceir.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందపర్చాలన్నారు. వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత ఓ ఐడీ నంబర్ ఫిర్యాదుదారుడికి వస్తుందన్నారు. సీఈఐఆర్(సెంట్రల్ ఎక్యూప్‌మెంట్ ఐడెంటీ రిజిస్ట్రేషన్)లో డిపార్ట్‌మెంటల్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ సంబంధించిన వారు వారి పరిధిలోని అన్ని సెల్‌ఫోన్ టవర్లకు మెసేజీలు పంపించి సెల్‌ఫోన్‌ను బ్లాక్ చేస్తారని తెలిపారు. ఇలా చేయడంతో ఎవరూ కూడా సెల్‌ఫోను ఉపయోగించబోరని తెలిపారు. ఎవరైనా మొబైల్‌ను ఉపయోగిస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు మెసేజ్ వెళ్తుందన్నారు. మెసేజ్ వెళ్లినట్లయితే మొబైల్‌ను గుర్తించి పట్టుకోవడం జరుగుతుందన్నారు. తర్వాత ఫిర్యాదుదారుడు మొబైల్‌ను రిక్వెస్ట్ ఐడీ ద్వారా వాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐటీ కోర్ ఇన్‌చార్జి సీఐ ఎండీ ముఖీద్ పాషా, ఆర్ఎస్సై నిశీత్ పాల్గొన్నారు.



ఉమ్మెడ వద్ద గోదావరి పరీవాహక ప్రాంతం

గోదారికి వృక్షమాల

- నది గట్లపై మొక్కలు నాటనున్న అధికారులు
- జిల్లాలో తొమ్మిది మండలాలు ఎంపిక
- అనువైన స్థలాల గుర్తింపు కోసం కసరత్తు
- జూన్‌లో నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ
- ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మహా కార్యానికి శ్రీకారం

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : అజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా నదుల గట్లపై మొక్కలు నాటాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'వృక్షమాల' పేరుతో చేపట్టే ఈ మహా కార్యాన్ని విజయవతం చేయాలని అన్ని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖలకు ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అందుకున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గోదావరి ఒడ్డుపై మొక్కలు నాటేందుకు కసరత్తు చేపడుతున్నారు. ఉపాధిహామీ కింద పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఐతే, హరితహారం కార్యక్రమంలో భాగంగా రానున్న జూన్‌లో నదుల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని భావిస్తున్నారు.

తొమ్మిది మండలాల్లో..

జిల్లా మీదుగా ప్రధానంగా గోదావరి, మంజీరా నదులు ప్రవహిస్తున్నాయి. వీటి పరివాహక ప్రాంతాల్లో ఉన్న తొమ్మిది మండలాలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో ఆర్మూర్, నందిపేట్, బాల్కొండ, ఏర్గట్ల, ముప్కాల్, మెండోరా, బోధన్, నవీపేట్, రెంజల్ ఉన్నాయి. ఈ మండలాల మీదుగా వెళ్తున్న నదుల గట్లపై మొక్కలు నాటనున్నారు. ఇందుకు అనువైన స్థలాలను గుర్తించాలని ఏపీవోలు, టీఏలకు డీఆర్‌డీవో ఆదేశాలిచ్చారు. ఇరిగేషన్, ఫారెస్టు అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. 2.5 ఎకరాలకు ఒక బ్లాక్ ప్లాంటేషన్ చేయాలని, నది గట్లపై కూడా వరుస క్రమంలో నాటాలని అధికారులు అనుకుంటున్నారు. కానుగ, చింత, నీలగిరి, ఇతర రకాలు కలిపి జిల్లా వ్యాప్తంగా ఎన్ని మొక్కలు అవసరం కానున్నాయో అంచనాలు తయారు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు గ్రామ సభలు నిర్వహించి స్థలాల గుర్తింపు, తీర్మాణాలు సిద్ధం చేయాలని యోచిస్తున్నారు. వర్షాలు వచ్చే ముందు జూన్ రెండో వారానికల్లా గుంతలు తవ్వి జూలై అఖరు నాటికి మొక్కలు నాటడం పూర్తి చేయనున్నారు. ఉపాధిహామీ కూలీలతో పనులు చేయించి వారికి ఉపాధి లభించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

స్థలాలను త్వరగా గుర్తించాలి..



వృక్షమాల పేరుతో జిల్లాలోని గోదావరి, మంజీరా నదుల ఒడ్డున మొక్కలు నాటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆదేశాలు వచ్చాయి. త్వరగా స్థలాలను గుర్తించాలని తొమ్మిది మండలాల ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశించాం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

– చందర్ నాయక్, డీఆర్‌డీవో, నిజామాబాద్

నదుల స్థలాలకు రక్షణ కూడా..

జిల్లాలో ఆయా మండలాలకు అనుకుని ప్రవహిస్తున్న గోదావరి, మంజీరా నదుల గట్లపై మొక్కలు నాటడంతో అడవులు పెరగనున్నాయి. ఇటు పర్యావరణానికి మేలు జరుగుతుంది. అయితే, నదుల ఒడ్లను దాటుకుని భూములను కబ్జా చేసినవారు చాల మంది ఉన్నారు. అక్రమంగా గోదావరి స్థలాలను ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్న రైతులు కూడా ఉన్నారని చెప్పవచ్చు. నదుల గట్లపై మొక్కలు నాటితే అవి చెట్లుగా మారి సరిహద్దులుగా ఉండనున్నాయి. తద్వారా భూములు అన్యక్రాంతం కాకుండా ఉంటాయి. అంతేకాకుండా అనేక జీవ రాశులకు చెట్లు నీడనివ్వనున్నాయి. పర్యాటకంగా కూడా ప్రజలను ఆకట్టుకుంటాయి.

ఖజానా ఖాళీ..!

- తెయూలో పాలకమండలి ఆమోదం లేకుండా విచ్చలవిడి ఖర్చులు
- ఎప్పటికప్పుడు ఉన్నత విద్యాకమిషనర్‌కు సమాచారం ఇచ్చిన విద్యార్థి సంఘాలు
- అయినా ఫలితం లేదంటున్న నాయకులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయం ఖజానా ఖాళీ అయ్యింది. దీంతో ప్రతినెల 1న రావాల్సిన ప్రొఫెసర్ల జీతాలు 4వ తేదీ దాకా రావడం లేదు. ఈసీ అనుమతులు లేకుండా వీసీ విచ్చలవిడి కొనుగోళ్లు చేయడంతో ఈ పరిస్థితి నెలకొందని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. వర్సిటీలో ప్రధానంగా మూడు విభాగాల ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. ఇందులో మొదటిది రిజిస్ట్రార్ ఫండ్ అకౌంట్, రెండోది పరీక్షల విభాగం, మూడోది అకడమిక్ ఆడిట్ విభాగం. ఈ మూడు విభాగాల లావాదేవీలు రిజిస్ట్రార్ పేరుమీదే జరుగుతాయి. రిజిస్ట్రార్ ఫండ్ అకౌంట్ నుంచి వేతనాలు, కొన్ని అవసరాల కు మాత్రమే లావాదేవీలు చేస్తారు. మిగతా రెండు విభాగాలకు సంబంధించిన నిధులను ఆ యాశాఖల అవసరాలకు వినియోగించాలి. వాస్తవంగా వర్సిటీలో లావాదేవీలు వీసీ అనుమతితో రిజిస్ట్రార్ పేరుమీద జరుగుతాయి. ఇందుకు సంబంధించి ఆయా విభాగాల ఖర్చులు మాత్రమే చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి అభివృద్ధి గ్రాంట్స్ విడుదల కావడం లేదు. ఈ క్రమంలో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలు చిన్న మొత్తం మేర ఖర్చు చేయాలన్నా ఆయా పాలక మండలి సమావేశాల్లో అనుమతి తీసుకుంటున్నా యి. కానీ తెలంగాణ వర్సిటీలో వీసీ ఇందుకు విరుద్ధంగా చేస్తున్నారు. రెండేళ్లలో కనీసం ఒక్కటంటే ఒక్క పద్దుకు సైతం వీసీ ఎలాంటి ప్రతిపాదన పెట్టలేదు. ఈసీ దృష్టికి తీసుకెళ్లకుండానే విచ్చలవిడిగా ఖర్చులు చేశారు.

అవసరం లేని ప్రతిపాదనలు..

వర్సిటీలో అంతగా అవసరం లేని ప్రతిపాదనలు పెట్టించిన వీసీ మొదట రిజిస్ట్రార్ రెగ్యులర్ ఫండ్ అకౌంట్ ఖాళీ చేశారు. ఈ నేపథ్యంలో అప్పటి రిజిస్ట్రార్ శివశంకర్ సుమారు రూ. 10 కోట్లను రెండు విడతలుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా మార్చారు. మిగిలిన సుమారు రూ. 4కోట్లను మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరిట దారి మళ్లించినట్లు సమాచారం. తర్వాత పరీక్షల విభాగం ఖాతా నుంచి రూ. 6 కోట్ల నిధులు దారి మళ్లించినట్లు సమాచారం. అదేవిధంగా అకడమిక్ ఆడిట్ సెల్ నిధులను దుర్వినియోగం చేసినట్లు తెలిసింది. కెమిస్ట్రీ, ఫిజిక్స్ తదితర విభాగాల్లో గుండు పిన్ను నుంచి ఇతరాలన్నీ తెచ్చే బాధ్యత ఒక్కరికే అప్పగించడం గమనార్హం.

■ నిజానికి ప్రతి పైసా ఖర్చు చేసినప్పుడు ఆయా ఖర్చు అవసరాన్ని ఈసీకి తెలియజేయాల్సి ఉంటుంది. ఈ ప్రాథమిక సూత్రాన్ని వీసీ తుంగలో తొక్కారు. ఈసీకి చైర్మన్ తానే కావడంతో తనమాటే శిలాశాసనం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇంత విచ్చలవిడిగా ఖర్చులు గతంలో ఎన్నడూ చూడలేదని ప్రొఫెసర్లు అంటున్నారు. ఈ విషయాలన్నీ విద్యార్థి సంఘాలు ఎప్పటికప్పుడు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌కు తెలియజేస్తూనే ఉన్నారు. అయితే అడ్డగోలు నియామకాలు, విచ్చలవిడి ఖర్చులపై మిట్టల్ పట్టనట్లుగా ఉండడం అనుమానాలకు తావిస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలోనే వీసీ ఇవన్నీ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. కాగా ఈ నెల 19న ఈసీ సమావేశం తూతూమంత్రంగానే జరగనున్నట్లు తెలుస్తోంది. నవీన్ మిట్టల్ బదులుగా ఆయన కింద స్థాయి అధికారి సమావేశానికి వస్తారని సమాచారం. కాగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి సైతం పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు వివిధ దశల్లో న్యాయసేవలు

- జిల్లా జడ్జి సునీత కుంచాల

నందిపేట్(ఆర్మూర్): అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా రైతులకు వివిధ దశల్లో న్యాయ సేవలు అందిస్తామని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. నందిపేట లోని రైతువేదికలో సోమవారం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సేవాధికారి సంస్థ సహాయం చేస్తుందన్నారు. వీడీసీలు గ్రామాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కాగా వీడీసీల నడవడిక చట్టబద్ధంగా ఉండాల ని సూచించారు. కార్యక్రమంలో ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నజీం సుల్తానా, ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల, లీగల్ ఎయిడ్ క్లినిక్ నాయయవాది గట్టడి ఆనంద్, న్యాయసేవా సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, ఎంపీడీవో నాగవర్ధన్, ఎస్సై శ్రీకాంత్, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవానీ, సర్పంచ్ వాణి తదితరులు పాల్గొన్నారు.



అగ్రి ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి

గడ్కోల్‌లో కుటుంబంపై బహిష్కరణ ఎత్తివేత

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి: సిరికొండ మండలం గడ్కోల్‌లో ఓ కుటుంబంపై వీడీసీ విధించిన బహిష్కరణను ఎత్తివేశారు. 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'పల్లెల్లో పెదరాయుళ్లు' కథనానికి పోలీసులు స్పందించారు. ధర్పల్లి సీఐ సైదా సోమవారం గడ్కోల్ ఆల్ కమిటీ(వీడీసీ), కులసంఘాల సభ్యులతో పాటు బహిష్కరణకు గురైన నిర్మల, ఆమె భర్త రమేశ్‌ను పిలిపించి మాట్లాడి బహిష్కరణ ఎత్తివేయించారు. అసలేం జరిగిందంటే.. గడ్కోల్‌లో ఆరు నెలల క్రితం ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న చిన్నపిల్లల మధ్య గొడవ జరిగింది. ఇది ఇద్దరి మహిళల మధ్య గొడవకు దారి తీసింది. అనంతరం వీరి పంచాయితీ పోలీస్‌స్టేషన్‌తో పాటు కోర్టుకు వెళ్లింది. కోర్టు జరిమానా విధించడంతో వారు చెల్లించారు. కానీ వీడీసీ వారు సైతం రూ. లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. వీరు చెల్లించలేకపోవడంతో వారిని కులసంఘం నుంచి బహిష్కరించారు. దీంతో ధర్పల్లి సీఐ ఇరుపక్షాలను పిలిచి మాట్లాడి సముదాయించి బహిష్కరణ ఎత్తివేయించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

వచ్చారు.. వెళ్లారు..!

- జీజీహెచ్‌లో రోగిని కాళ్లు పట్టి లాక్కెళ్లిన ఘటనపై విచారణ కమిటీ ఆరా
- పత్తాలేని బాధితుల జాడ
- కేవలం వైద్య సిబ్బందితోనే విచారణా..?

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 1న రోగి కాళ్లు పట్టి లాక్కెళ్లిన ఘటనపై విచారణ కమిటీ బృందం సోమవారం ఆరా తీసేందుకు అలా వచ్చి ఇలా వెళ్లింది. రోగి కుటుంబ సభ్యులు రోగిని కాళ్లు పట్టి వైద్యుడి వద్దకు లాక్కెళ్తున్న వీడియో వైరల్ అయినా విచారణకు వచ్చిన బృందం రోగి కాళ్లు పట్టి లాగలేదని పేర్కొనడం విచారకరం. రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన ఈ ఘటనలో అసలు ఆ రోజు ఏం జరిగిందో తెలుసుకునేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సమగ్ర విచారణకు ఆదేశించింది. ఇందులో మొదట విచారించాల్సింది బాధిత రోగి, ఆయనతో పాటు వచ్చిన సహాయకులు కానీ ఎవరూ లేకుండానే విచారణ కమిటీ కేవలం వైద్యసిబ్బందిని మాత్రమే విచారించడం గమనార్హం. ఘటనపై విచారణకు ఆదిలాబాద్ రిమ్స్ సీనియర్ ప్రొఫెసర్లు ఇద్రీస్, రత్నకుమారీలు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు.



ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న విచారణ కమిటీ బృందం సభ్యులు

విచారణ కొనసాగిందిలా..

విచారణ కమిటీ బృందం సోమవారం ఉద యం 8 గంటలకు ఆస్పత్రికి చేరుకుని అన్ని వా ర్డులను పరిశీలించారు. రోగిని కింది అంతస్తు లో లాక్కెళ్లిన ప్రాంతం, రెండో అంతస్తులో లా క్కెళ్లిన ప్రాంతాలను పరిశీలించారు.

ఘటనకు సంబంధించి డ్యూటీ వైద్యులను, స్టాఫ్‌నర్సులను, పేషెంట్ కేర్ సిబ్బందిని పిలిచి విచారించారు. ఉదయం 10 గంటలకు మొదలైన విచారణ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. అనంతరం సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను విచారణ కమిటీ సభ్యులు కలిశారు. ఆస్పత్రిలోని పరిణామాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు.

రోగి జాడేది..!

నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో కలకలం రేగిన ఘటనకు సంబంధించి రోగి ఆచూకీ నేటికి తెలియడంలేదు. ఘటనలో ఆ రోజు ఏం జరిగిందో తెలియాలంటే సంఘటనకు సంబంధించిన రోగిని విచారిస్తే గాని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉందా లేదా, ఆస్పత్రిని బదనాం చేసేందుకు కుట్ర పన్నారా అనేది తేలిపోతుంది. కానీ ఇప్పటి వరకు రోగి జాడను కనుక్కోలేదు.

నివేదికలు డీఎంఈకి సమర్పిస్తాం

నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏప్రిల్ 1న చోటు చేసుకున్న పరిణామంపై విచారణ చేపట్టాం. దీనిపై రెండు రోజుల్లో డీఎంఈకి, ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తాం. ఓపీలో నమోదైన జాబితాలో పేషెంట్ ఫోన్‌నంబర్ లేదు. స్ట్రెచర్ లేకపోవడంతో పేషెంట్‌ను లాక్కెళ్లింది నిజమేనా అని అడిగిన ప్రశ్నకు ఎవరూ లాక్కెళ్లలేదని సమాధానం ఇచ్చారు. రోగిని లాక్కెళ్తున్నట్లు వీడియోలు ఉన్నాయి కదా, ఆస్పత్రిని బదనాం చేసేందుకు ఇదంతా జరుగుతుందా అన్న ప్రశ్నకు మీడియాలో వచ్చిన ప్రసారాలను పరిశీలిస్తున్నామని, నిజానిజాలు ఎంక్వైరీలో తేలుతాయి.

– ఇద్రీస్, రిమ్స్ సీనియర్ ప్రొఫెసర్

ప్రభుత్వ సూచనల మేరకే..

ఆస్పత్రిలో జరిగిన సంఘటనపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంక్వైరీ జరిగింది. ఎంక్వైరీ కమిటీ ప్రభుత్వం చేసిన గైడ్‌లైన్స్ ప్రకారం పరిశీలించారు. వివిధ కోణాల్లో ఎంక్వైరీ చేశారు. రిపోర్టు ప్రభుత్వానికి, డీఎంఈకి నివేదిస్తారు. ఉదయం నుంచి వివిధ కోణాల్లో విచారణ చేసి, సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రతివార్డు పరిశీలించారు. దీని ఆధారంగా డీఎంఈకి రిపోర్టు సబ్‌మిట్ చేస్తారు.

– ప్రతిమారాజ్ సూపరింటెండెంట్, జీజీహెచ్

ఖరీఫ్‌కు దండిగా ఎరువులు..

- వచ్చే సీజన్‌కు సన్నద్ధమవుతున్న వ్యవసాయ శాఖ
- జిల్లాకు 1.51లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): రానున్న వానాకాలం సీజన్‌కు వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. ఎరువులను ముందుగానే జిల్లాకు తెప్పించుకోవడానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకు జిల్లాకు 1.51 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనాలను తయారు చేశారు. ప్రతిపాదనలు సైతం రాష్ట్రశాఖకు వెళ్లాయి. ఇప్పటికే కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆధ్వర్యంలో వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖలతో సమావేశమై పరిస్థితులను సమీక్షించారు. అయితే, ఖరీఫ్‌లో వరిని రైతులు ఎక్కువగా సాగు చేస్తారని, 5 లక్షల ఎకరాలకు పైగా పంటను వేసే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు భారీగా ఎరువులను తెప్పిస్తున్నారు. యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ కలిపి మొత్తం 1,51,154 మెట్రిక్ టన్ను లు దశల వారీగా జిల్లాకు రానుంది. గతేడాది వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఎక్కువ ఎరువులు రానున్నాయి. రైలు వ్యాగన్ కూడా జిల్లాకు వస్తుందనే సమాచారంతో జిల్లాలోని మార్క్‌ఫెడ్, ప్రైవేటు గోదాములను సిద్ధం చేసి ఉంచుతున్నారు. భారీ కెపాసిటీ గల గోదాములను వెతుకుతున్నారు. గత వానాకాలంలో యూరియా 59,884 మెట్రిక్ టన్నులు, అలాగే ఇతర ఎరువులు కలిపి మొత్తం 1,08,464 మెట్రిక్ టన్నులు వినియోగం జరిగింది. రానున్న వానాకాలానికి ఇంతకు మించి ఎరువులు వాడే అవకాశముంది.



రైలు వ్యాగన్ నుంచి ఎరువులను లారీల్లో ఎక్కిస్తున్న కూలీలు (ఫైల్)

యాసంగి స్ఫూర్తితో ముందుకు..

వానాకాలం సీజన్‌లో ఎరువుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు, కొరత ఏర్పడకుండా వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. అయితే మొన్నటి యాసంగి సీజన్‌లో 4లక్షల ఎకరాలకు పైగా వరి, వరి 26వేల ఎకరాలు సాగు చేశారు. ఇందుకు రైతులు యూరియాను భారీగా వినియోగించారు. 70,813 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ 11,388, ఎంవోపీ 1,140, కాంప్లెక్స్ 36,668 మెట్రిక్ టన్నులు కొనుగోలైంది. కొత్తగా వచ్చిన జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి యూరియా కొరత రాకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను చక్కదిద్దారు. రాష్ట్ర శాఖ నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటకు కూడా యాసంగి మాదిరిగా ప్రణాళిక ప్రకారం ఎరువులు అందించాలనుకుంటున్నారు.

బఫర్ స్టాక్ 53వేల మెట్రిక్ టన్నులు

ఖరీఫ్ ఎరువులు రైలు వ్యాగన్‌లో జిల్లాకు రాకముందే జిల్లాలో బఫర్ నిల్వలున్నాయి. యూరియా 13,981 మెట్రిక్ టన్నులు, డీఏపీ 9,129, పొటాష్ 348, కాంప్లెక్స్ 29,567, ఎస్ఎస్‌పీ 320 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 53,347 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. నిజామాబాద్‌తో పాటు, నిర్మల్, కామారెడ్డి జిల్లాకు సంబంధించిన ఎరువులు కూడా మన జిల్లా గోదాముల్లోనే నిల్వ ఉంచుతున్నారు.

వానాకాలం సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు (మె.టన్నుల్లో)

యూరియా	89,836
డీఏపీ	21,619
ఎంవోపీ	6,657
కాంప్లెక్స్	32,383
ఎస్ఎస్‌పీ	659

ముందస్తు ప్రణాళికతో..



వచ్చే ఖరీఫ్ పంటల సీజన్‌కు జిల్లాకు అవసరమైన ఎరువులను తక్కువ కాకుండా తెప్పిస్తాం. త్వరలో జిల్లాకు రైలు వ్యాగన్ల ద్వారా దశల వారీగా ఎరువులు రానున్నాయి. ఇందుకు గోదాములు వెతికి స్థలాలను సిద్ధం చేసి పెడుతున్నాం. ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తాం. యూరియా కొరత ఏర్పడకుండా బఫర్ స్టాక్‌ను ఉంచాం.

– ఆర్ తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిజామాబాద్

క్లుప్తంగా

జిల్లాకు 87 ఎలక్ట్రిక్ బస్సులు



డిచ్‌పల్లి: ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కృషితో నిజామాబాద్ జిల్లాకు 87 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ డిపో -1 మేనేజర్ బీఎస్ ఆనంద్ తెలిపారు. సోమవారం సాయంత్రం డిచ్‌పల్లి బస్టాండ్‌ను ఆయన తనిఖీ చేశారు. బస్టాండ్ మీదుగా రాకపోకలు సాగించే బస్సుల వివరాలు, సదుపాయాలను కంట్రోలర్ చందర్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లోకి ఇటీవల ఎక్స్‌ప్రెస్ బస్సులు వస్తున్నాయని కంట్రోలర్ డీఎంకు తెలిపారు. బస్టాండ్‌లో వ్యాపార సంస్థల ప్రకటనల కోసం టెండర్‌లు పూర్తిచేశామని డీఎం తెలిపారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, బస్టాండ్‌లో ప్రజాప్రతినిధుల పేర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వైఆర్ బాబు ఉన్నారు.

క్షయ రహిత జిల్లా లక్ష్యం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్‌ను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ లక్ష్యంతో పనిచేయాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజేశం అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ జిల్లాలో నూతన క్షయ వ్యాధిగ్రస్తులను 60శాతం వరకు తగ్గించడం ద్వారా జిల్లాకు జాతీయస్థాయిలో బంగారు పతకం దక్కిందన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్‌ను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ జిల్లాలో టీబీ వ్యాధిగ్రస్తులను తగ్గించేందుకు తీవ్రంగా కృషి చేశామన్నారు. అనంతరం సూర్య హెల్త్ స్వచ్ఛంద సేవా సంస్థ రాజేందర్, సూర్య భగవాన్ ఆధ్వర్యంలో 50 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్‌లను పంపిణీ చేశారు. రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ఘన, రాష్ట్ర సమాచార ప్రచార విభాగం చైర్మన్ జితేందర్, టెక్నికల్ ఆఫీసర్ వాసు ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు రమేష్, విద్య, డాక్టర్ నీలి రామచందర్, విశాల్, డీఎల్ఎన్ స్వామి, నాగరాజ్, అశోక్, రాజేష్, రాజేశ్వర్, రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, టీబీ సమన్వయకర్త రవి గౌడ్, డీహెచ్‌ఈ ఘనపూర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభించిన మేయర్

ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం పీవోడీటీ ఆఫీస్ నుంచి నిర్వహించిన ర్యాలీని మేయర్ దండు నీతూకిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ న్యూ అంబేడ్కర్ భవన్ వరకు కొనసాగింది.

డైట్ ప్రిన్సిపాల్‌పై విచారణ

నిజామాబాద్‌అర్బన్: నాగారంలోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై వరగంల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి విచారణ చేశారు. నాలుగు రోజుల క్రితం కాలేజీకి వచ్చి విచారణ చేపట్టారు. హాజరు శాతం విషయంలో ప్రిన్సిపాల్ వివక్ష చూపుతున్నట్లు కొందరు విద్యార్థులు ఆయనపై గతంలో ఫిర్యాదు చేశారు. గతంలో అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి కూడా ఇద్దరు అధికారులతో విచారణ చేయించారు. గతంలో నిర్వహించిన విచారణ సక్రమంగా లేదని విద్యార్థులు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర అధికారులు ఆర్‌జేడీని విచారణకు పంపించారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టొద్దు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 73 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్లు

నిజామాబాద్‌నాగారం: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 73 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, డీఆర్డీవో చందర్ పాల్గొన్నారు. జిల్లాలోని సారంగపూర్‌లో పశువైద్య కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య, సాయిబాబు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌లోని సాయి కాన్సెప్ట్ స్కూల్‌ను శ్రీచైతన్య యాజమాన్యం తీసుకొని కార్పొరేట్ పేరుతో అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతోందని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాలా మాట్లాడుతూ శ్రీ చైతన్య యాజమాన్యంపై, అదేవిధంగా సాయి కాన్సెప్ట్ స్కూల్‌పై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అరవింద్, శ్రావణ్, శిల్పా, ప్రశాంతి, నాగజ్యోతి పాల్గొన్నారు.

స్పృహ తప్పి పడిపోయిన ఉద్యోగి

ప్రజావాణి లో ఓ ఉద్యో గి స్పృహ తప్పి పడిపోయింది. ఐసీడీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న స్వప్న ప్రజావాణిలోనే స్పృహ తప్పి పడిపోయింది. ఇది గమనించిన అధికారులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



స్వప్నను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తిండి లేక భిక్షాటన.. పెన్షన్ ఇప్పించండి సారూ



'తినడానికి తిండి లేక అడుక్కుతింటున్నా.. భర్త చనిపోయి ఆధారం లేక ఉన్నా'నని వితంతు పెన్షన్ ఇప్పించాలని నందిపేట మండలం వెన్నెల్ కే గ్రామానికి చెందిన కైసర్ బేగం వేడుకుంది. వితంతు పెన్షన్ కోసం తను అడుక్కునే బొచ్చెతో కలెక్టరేట్‌కు వచ్చింది. తన భర్త 2020లో చనిపోయాడని, దరఖాస్తులు చేసుకొని మూడేళ్లు గడిచినా వితంతు పెన్షన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

కామారెడ్డిలో 64 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 64 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్, అధికారులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డీఆర్‌డీఓ సాయన్న, ఏవో రవీందర్, అధికారులు దయానంద్, వెంకటేష్, సాయి భుజంగరావు పాల్గొన్నారు.

భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక



వినయ్‌ను సన్మానిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

డిచ్‌పల్లి: భారత్ అండర్-18 జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్టుకు డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి గ్రామానికి చెందిన గుండ వినయ్ ఎంపికయ్యారు. ప్రస్తుతం వినయ్ బోధన్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 2, 3 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ఆర్‌డీటీలో జరిగిన అండర్-18 (జూనియర్) సెలెక్షన్ ట్రయల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి భారత జట్టుకు ఎంపికైనట్లు నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ప్రభాకర్‌రెడ్డి, ఎం గంగమోహన్ తెలిపారు. జపాన్‌లో జూన్ 23, 24 తేదీల్లో జరగనున్న అండర్-18 జూనియర్ బాలుర ఏషియన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో వినయ్ పాల్గొంటారని వారు తెలిపారు. సోమవారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినయ్‌ను సన్మానించారు. సాంఘిక సంక్షేమ గురుకుల స్పోర్ట్స్ ఆఫీసర్ రామ్‌లక్ష్మణ్, రీజినల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి నీరజ, సాఫ్ట్‌బాల్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ ఇట్యాల నరేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బొజ్జ మల్లేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి


- కుమారుడికి తీవ్రగాయాలు
- కారు టైరు పేలి, లారీని ఢీకొనడంతో ఘటన



ప్రమాదంలో ధ్వంసమైన కారు

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి శివారులోని 63వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా ఆయన కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. ఆర్మూర్‌కు చెందిన భూషం ప్రతాప్(42), తన కుమారుడు పార్థుతో కలిసి కారులో నిజామాబాద్ వెళ్తున్నారు. కారు మునిపల్లి శివారుకు రాగానే టైరు పేలడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. దీంతో భూషం ప్రతాప్, పార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో భూషం ప్రతాప్ చికిత్స పొందుతూ మృతి చెందారు. పార్థుకు రెండు కాళ్లు విరిగాయి. కాగా ప్రమాద సమయంలో పార్థు కారు డ్రైవ్ చేస్తున్నాడు. మృతుడికి భార్య లహరి, మరో కుమారుడు ఉన్నారు.

ఆర్మూర్‌లో విషాదఛాయలు



ప్రతాప్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌కు చెందిన బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ కార్యదర్శి బూసం ప్రతాప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజకీయాలకు అతీతంగా అందరితో కలుపుగోలుగా ఉండే ప్రతాప్ అకాల మరణం పట్ల పట్టణ ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రతాప్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న తన ఇంటికి సంబంధించిన సామగ్రిని తీసుకు రావడనికి తన పెద్ద కుమారుడు పార్థుతో కలిసి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

వలలో చిక్కుకుని జాలరి మృతి



స్వామి (ఫైల్)

మాచారెడ్డి: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు తాను వేసిన వలలోనే చిక్కుకుని జాలరి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని లచ్చాపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కామునిస్వామి (28) ఆదివారం సాయంత్రం చేపల వేటకని సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువమానేరు నిలువ నీటిలో చేపల వేటకు వలవేశాడు. ప్రమాదవశాత్తు అదే వలలో చిక్కుకుని మృతిచెందాడు. స్వామి రాత్రివరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులతో పాటు గ్రామస్తులు మానేరు బ్యాక్ వాటర్‌లో గాలించగా, వలలో చిక్కి శవమై కనిపించాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నీట మునిగి బాలుడు..

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ బాలుడు మృతి చెందిన ఘటన కామారెడ్డి పెద్ద చెరువు వద్ద సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీనగర్ కాలనీలో నివాసముండే కడమంచి చంద్రయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దవాడైన సంజీవ్ (14)కు మతిస్థిమితం సక్రమంగా లేదు. చాలాసార్లు ఆస్పత్రులలో చూపించారు. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి వస్తానని తన తల్లితో చెప్పిన సంజీవ్ ఇంటికి తిరిగి రాలేదు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. సోమవారం మధ్యాహ్నం కామారెడ్డి పెద్ద చెరువులో ఓ బాలుడి మృతదేహం తేలినట్లుగా స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బయటకు తీయించారు. పోలీసుల సమాచారం మేరకు సంజీవ్ కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని మృతుడిని సంజీవ్‌గా నిర్ధారించారు. అతనికి ఈత రాదని కుటుంబ సభ్యులు తెలిపారు. సరదాగా చెరువు దగ్గరకు వెళ్ళి ప్రమావశాత్తు నీట మునిగి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

దోమకొండ: దోమకొండకు చెందిన నర్రాగుల నవీన్‌కుమార్ (26) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన నవీన్‌కుమార్ తిరిగి రాలేదు. తండ్రి నర్సింలు వ్యవసాయబావి వద్దకు వెళ్లగా అక్కడ చెట్టుకు ఉరివేసుకుని ఉన్నాడు. ఇటీవల నవీన్ ఆరోగ్యం బాగాలేదని, దీనికి తోడు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చెప్పారు. నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఒకరి అదృశ్యం

ఇందల్వాయి: ఇందల్వాయికి చెందిన ముత్యం నరేష్ అదృశ్యమైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. నరేష్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గతంలో వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. దీంతో ఆర్థిక విషయాలై గొడవపడి ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య సింధూజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ డీఎం, ఎంవీఐ తీరుపై ఆటోడ్రైవర్ల నిరసన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్, ఎంవీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆటోలకు జరిమానాలు, ఆటోల్లో నుంచి ప్రయాణికులను దింపి బస్సుల్లో ఎక్కించి తమ పొట్ట కొడుతున్నారని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ ఎదుట ధర్నా చేపట్టారు. వందల సంఖ్యలో ఆటోలను రోడ్డుకు అడ్డంగా పెట్టి డీఎం, ఎంవీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు అద్దాలపై, హెడ్ లైట్‌లపై కర్రలతో కొట్టి ధ్వంసం చేస్తున్నారన్నారు. దీంతో ఎస్సై రాములు, శివరాం నాయక్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ఏఐటీయూసీ నాయకుడు ఆరెపల్లి సాయిలుతో పాటు మరికొంత మందిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ స్వామి రోడ్డుపై ఉన్న ఆటోను పక్కకు జరిపే యత్నం చేయగా ఆటోడ్రైవర్లు దాడికి దిగారు. స్వామి బస్టాండ్ వైపు పరుగులు తీయగా రాళ్లతో దాడి చేశారు. అక్కడి నుంచి ఆటో డ్రైవర్లు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు ఆటోడ్రైవర్లతో మాట్లాడి శాంతింపజేశారు.



బస్టాండ్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

బోరుబావి విషయంలో వివాదం

భిక్కనూరు: నీటి ఎద్దడి నివారణకు తవ్విన బోరు విషయంలో మండలంలోని పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామాల మధ్య వివాదం నెలకొంది. కంచర్లలో నీటి ఎద్దడి నివారణ కోసం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు సోమవారం బోరుబావి తవ్వకం పనులను ప్రారంభించారు. బోరు వేస్తున్న స్థలం పెద్దమల్లారెడ్డి శివారులోని చెరువు స్థలం అని గ్రామస్తులు కొందరూ సర్పంచ్ లక్ష్మి రాజలింగంకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ భర్త రాజలింగం మరి కొందరితో కలిసి అక్కడికి వెళ్లి పనులను నిలిపి వేయించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బోరు వేస్తున్నామని కంచర్ల ప్రజాప్రతినిధులు తెలిపారు. దీంతో పెద్దమల్లారెడ్డి సర్పంచ్ భర్త రాజలింగం తమ గ్రామంలో నీటి ఎద్దడి ప్రారంభం అవుతుందని తమకు కూడా బోర్ బావి తవ్వించాలని ఎమ్మెల్యే గోవర్ధన్‌ను ఫోన్‌లో కోరాడు. అనంతరం తమ గ్రామ పరిధిలో వేస్తున్న ఈ బోరుబావిని తమనే వాడుకోవాలని ఎమ్మెల్యే చెప్పారని, కంచర్ల గ్రామస్తులు మరో చోట బోరు వేసుకోవాలని చెప్పినట్లు రాజలింగం తెలిపారు. కాగా బోరుబావిలో పుష్కలంగా నీరు వచ్చింది. దీంతో తమ గ్రామం కోసం వేసిన బోరుబావిలో నీరు వచ్చిందని ఇరుగ్రామాల ప్రజలు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. తమ గ్రామ పరిధిలోనే బోరు వేశారని, నీరు పుష్కలంగా వచ్చిందని మంగళవారం బోర్‌లో మోటార్ బిగిస్తామని రాజలింగం తెలిపారు.

ఆటో బ్రేక్ వేయడంతో కిందపడి బాలిక మృతి



అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది, స్థానికులు

ఎడపల్లి(బోధన్): ఆటోను అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో అందులో నుంచి యువతి పడి మృతి చెందిన ఘటన నిజామాబాద్ నగరంలోని ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట్‌కు చెందిన సోని, పోచమోళ్ల మైసమ్మ(16) ఇద్దరు స్నేహితులు. వారు సోమవారం ఆటోలో నిజామాబాద్‌కు బయలుదేరారు. నవీపేట్ నుంచి ఆటోలో వస్తుండగా ఎడపల్లి మండలంలోని అశోక్‌సాగర్ వద్ద అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆటోలో ఉన్న మైసమ్మ రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతుదేహాన్ని అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతిరాలి తల్లి ఫిర్యాదు మేరు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: బాలికను అత్యాచారం చేసిన కేసులో ఒకరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ కామారెడ్డి పోక్సో కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్ జిల్లాలోని ప్రగతి(ధొంగల) ధర్మారం గ్రామానికి చెందిన బొజ్జా రవి బీబీపేటలోని తన సోదరి ఇంటికని వచ్చి ఇక్కడే పనులు వెతుక్కుని ఉండేవాడు. గతేడాది ఫిబ్రవరిలో బీబీపేటలోని ఓ ఆలయం వద్ద ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్లు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి తను ఉంటున్న ఇంటికి తీసుకెళ్లాడు. బాలికను అత్యాచారం చేయగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్ చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కామారెడ్డి పోక్సో కోర్టు న్యాయమూర్తి లాల్ సింగ్ నాయక్ నిందితునికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.ఐదు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి డీఎస్పీ సోమనాథం, బీబీపేట ఎస్సై రాజారాం, కోర్టు కానిస్టేబుల్ సదయ్య, లైజనింగ్ అధికారి హనుమాండ్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్‌ను ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

మూడు కేసుల్లో నేరస్తులకు..

ఖలీల్‌వాడి: నగరంలో మూడు బైక్‌లను చోరీ చేసిన బోధన్ మండలం సాలురా గ్రామానికి చెందిన ఇసుక సాయిలుకు ఒక్కొక్క కేసులో ఏడాది చొప్పున మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సౌందర్య సోమవారం తీర్పు చెప్పారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో మూడు బైక్‌లను చోరీ చేసినట్లు నేర విచారణ జరిపి అభియోగ పత్రం కోర్టులో సమర్పించారు. సాయిలుపై నేరారోపణలు రుజువయినట్లు నిర్ధారిస్తూ మూడేళ్ల జైలుశిక్ష విధించారు.

బంగారం చోరీ కేసులో..

నిజామాబాద్‌లోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సోమేష్ మూడో టౌన్ ఠాణా పరిధిలో మూడు చోట్ల బంగారం దొంగతనాలు చేశాడు. ఈ మేరకు పోలీసులు కోర్టులో అభియోగ పత్రాలు సమర్పించారు. ముద్దాయిపై నేరారోపణలు రుజువు కావడంతో అతడికి మూడు కేసుల్లో రెండేళ్ల చొప్పున కారాగార శిక్ష విధిస్తు జడ్జి సౌందర్య తీర్పు వెలువరించారు. పై కేసుల్లో ముద్దాయిలు ఏకకాలంలో జైలు జీవితం అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో...

సికింద్రాబాద్‌లోని అల్వాల్ సుమిత్ర అపార్ట్‌మెంట్ లో నివాసముండు బి వెంకటేష్‌కు చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలుశిక్ష ఖరారు చేస్తు జూనియర్ సివిల్ జడ్జి భవ్య తీర్పు చెప్పారు. నగరంలోని కుమార్‌గల్లీ చెందిన ధనలక్ష్మి దగ్గర వెంకటేష్ రూ.22 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. గ్యారంటీగా ప్రామిసరీ నోట్, బ్యాంకు చెక్‌ను ఇచ్చాడు. ధనలక్ష్మి బ్యాంకు అధికారులకు చెక్‌ను ఇవ్వగా వెంకటేష్ ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయినట్లు ధ్రువీకరణ పత్రము ఇచ్చారు. విచారణ జరిపిన కోర్టు వెంకటేష్ చెక్ బౌన్స్ నేరానికి పాల్పడినట్లు నిరూపణ అయిందని నిర్ధారిస్తూ ఆరు నెలల జైలు శిక్ష తోపాటు రూ.22 లక్షల జరిమానా విధించారు.

వ్యవసాయ సామగ్రి చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వద్ద చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రైతు పెద్ద బచ్చగారి జనార్ధన్‌రెడ్డి తన వ్యవసాయక్షేత్రంలోని గుడిసెలో ఎడ్ల బండి చక్రాలను, వ్యవసాయ పనిముట్లు సామాగ్రి, పెన్సింగ్‌ను ఉంచాడు. సోమవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెలోకి చొరబడి ఎడ్ల బండి చక్రలను ధ్వంసం చేసి వాటికి చెందిన ఇనుపు ఇరుసు, పనిముట్లను, ఇతర వ్యవసాయ సామగ్రిని, ఫెన్సింగ్ వైరును ఎత్తుకెళ్లారు. సోమవారం తన పొలానికి వెళ్లిన జనార్ధన్‌రెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీ అయిన వస్తువుల విలువ రూ.40 వేలు ఉంటుందని తెలిపాడు.

పోలీసులపై రౌడీషీటర్ దాడి

బోధన్‌టౌన్: విధుల్లో ఉన్న పోలీసులపై రౌడీషీటర్ దాడి చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బోధన్ పట్టణంలోని గోశాల రోడ్డులో నివసించే షేక్ అబ్దుల్ అలియాస్ అబ్దుల్లాపై రౌడీ షీట్ ఉంది. రౌడీ షీట్ నమోదయ్యాక హైదరాబాద్ వెళ్లిపోయిన అబ్దుల్.. ఆదివారం పట్టణానికి తిరిగి వచ్చాడు. ఆదివారం రాత్రి బోధన్ పాత బస్టాండ్ సమీపంలోని హైటెక్ బార్ ఎదుట గల మిర్చి బండి వద్దకు వెళ్లాడు. రూ. 500 ఇవ్వాలంటూ మిర్చీ బండి వ్యాపారి రవీందర్‌ను డిమాండ్ చేశాడు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని రవీందర్ ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రవీందర్‌పై అబ్దుల్ దాడి చేశాడు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయడంతో కానిస్టేబుల్స్ బాలాజీ, సంజీవ్ ఘటన స్థలానికి చేరుకున్నారు. వారు రౌడీ షీటర్‌ను ఆపేందుకు యత్నించగా.. వారిపైనా దాడికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన స్థానికులు రౌడీషీటర్‌పై దాడి చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులపై దాడిచేసిన రౌడీషీటర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బోధన్ పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానికుల దాడిలో గాయపడిన రౌడీషీటర్‌ను బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి నిజామాబాద్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించామని పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

పిట్లం: మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌లపై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన రాజు, బీబీపేట్ గ్రామానికి చెందిన సాయికుమార్ పిట్లం వైపు వస్తుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న హన్మండ్లు బైక్‌తో ఢీకొన్నాడు. ప్రమాదంలో రాజు, హన్మండ్లుకు తీవ్ర గాయాలు కాగ, సాయికుమార్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని హైవే సిబ్బంది చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

బీబీపేట:పెళ్లి చేసుకుంటానని చెప్పి యువతిని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తిరుపయ్య తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలానికి చెందిన ఓ యువతిని మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన వడ్ల శివకృష్ణ పెళ్లి చేసుకుంటానని చెప్పి, లొంగదీసుకున్నాడు. చివరకు పెళ్లి చేసుకోడానికి నిరాకరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై సాయికుమార్, సిబ్బంది ఉన్నారు.

చోరీ కేసులో ఒకరికి జైలు

బీబీపేట: బీబీపేటలోని ఓ కిరాణ దుకాణంలో దొంగతనం చేసిన వ్యక్తిని కోర్టు మూడు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. బీబీపేటకు చెందిన చేపూరి సందీప్ కిరాణ దుకాణంలో గత సంవత్సరం అక్టోబర్ 17న రాత్రి సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలానికి చెందిన నవీన్ చొరబడి నగదును దొంగిలించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. కామారెడ్డి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వెంకటేష్ ధ్రువ సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితుడికి మూడు నెలలు జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించారు.